క్లుప్తంగా

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న సీఈవో జాలిరెడ్డి

చినగంజాం: విధుల్లో సిబ్బంది చిత్తశుద్ధితో మెలగాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి జాలిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని సంతరావూరు గ్రామాన్ని సందర్శించి పలు కార్యాలయాలను పరిశీలించారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, సిబ్బంది అందజేస్తున్న సేవలు, సిబ్బంది పనితీరు, రికార్డుల పరిశీలన వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్ వాడీ కేంద్రం, ఆర్బీకే కేంద్రం, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవోడీ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బ్రహ్మయ్య


బాధ్యతలు చేపట్టిన బ్రహ్మయ్య

చినగంజాం: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పాలపర్తి బ్రహ్మయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంకొల్లు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన చినగంజాం తహసీల్దార్ కార్యాలయంలో పూర్తి అదనపు బాధ్యతలను చేపట్టారు. గతంలో పనిచేస్తున్న తహసీల్దార్ బదిలీ కావడంతో పోస్టు గత కొంతకాలంగా ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ఆయన ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. తహసీల్దార్ లేకపోవడంతో స్థానికంగా ప్రజలు ఇబ్బందులు గురవుతున్న నేపథ్యంలో ఆయన ఇన్‌చార్జ్‌గా చేరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన, పౌష్టికాహారం అందిస్తున్నామని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం కారంచేడు ఎన్‌టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ రికార్డులు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. పాఠశాలల నిర్వహణలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. ప్రతి రోజు సమయపాలన పాటించడంతో పాటు, అసెంబ్లీ నిర్వహించుకోవాలన్నారు. షెడ్యూల్ ప్రకారం తరగతులను నిర్వహించుకోవాలలని సూచించారు. కుకింగ్ నిర్వాహకులు తప్పకుండా నూతనంగా ఇచ్చిన మెనూను అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే విజయచంద్ర, ఆర్ పద్మావతి, విద్యార్థులు, కుకింగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

భావనారుషి స్వామికి ప్రత్యేక పూజలు


వసంతోత్సవంలో పాల్గొన్న కరణం వెంకటేష్

చీరాల అర్బన్: పట్టణంలోని సంతబజారులో వేంచేసియున్న భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం స్వామివారికి అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావులు పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను పద్మశాలీయ సంఘ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

నేడు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

జే.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేడు ఎన్‌ఎంఎంఎస్ మాదిరి పరీక్ష నిర్వహిస్తున్నట్లు అజిత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వద్దవల్లి వీరనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మాత్రమే ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాయటానికి అర్హులన్నారు. పరీక్షలో ఉతీర్ణులైన వారికి కేంద్ర ప్రభుత్వం రూ. 12 వేలు ఉపకార వేతనం అందిస్తుందని తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రభుత్వం ఫిబ్రవరి 4 వ తేదీన జరగనున్నట్లు తెలిపారు. పరీక్ష ద్వారా విద్యార్థులు వారి లోపాలను సరిదిద్దుకోవచ్చని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.

వాక్కాయ..

- చెర్రీ (వాక్కాయ) సాగుపై రైతుల ఆసక్తి
- 40 ఎకరాలకు పైగా సాగు
- వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో దిగుబడులు


పక్వానికి వచ్చిన చెర్రీ కాయలు


కాయలతో ఉన్న చెర్రీ చెట్లు

మేదరమెట్ల: సీజన్ పండ్లతో కాకుండా రైతన్నలు కొత్తకొత్త పంటలు సాగు చేసుకుంటూ ముందుకు దూసుకెళ్తున్నారు. ఎక్కడో కొండ ప్రాంతాల్లో లభ్యమయ్యే వాక్కాయకు గిరాకీ ఉండటంతో దానిని ముఖ్యపంటగా సాగు చేస్తూ లాభం పొందుతున్నాడు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి సాగుచేపడితే రైతులకు అధిక దిగుబడులు తద్వారా లాభాలు వస్తాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. వాక్కాయ మొక్కను కలే చెట్టు, కరండ, కలే కాయలు, కలివి కాయలు అని కూడా అంటారు. వాక మొక్కల కాయలను మారుపేరుగా క్రాన్ బెర్రీ అని ఇంగ్లిష్‌లో పిలుస్తారు. వీటివలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. విటమిన్ సీ అధికంగా ఉంటుంది. ఇది మధుమేహ వ్యాధిని నివారించడంలో అద్భుతంగా పని చేస్తుందని వైద్యులు చెప్తున్నారు. ఆరోగ్యదాయకమైన ఆదాయవనరుగా సాగు చేయగలిగిన పంటగా, ఏడాది పొడవునా పచ్చగా ఉండగలిగేలా, ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకోగలిగిన, బహుళ ప్రయోజనాలు కలిగిన పంటగా చెప్పుకోవచ్చు.

సాగువిధానం...

ఎకరాకు 200 మొక్కల చొప్పున 15 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో మొక్కలను నాటుకోవాలి. తేలిక పాటి తడిని అందచేసి మొక్కలను నాటుకోవచ్చు. ప్రతి ఏటా పది కిలోల చొప్పున పశువుల ఎరువును మొక్క పాదల్లో వేసుకుంటూ ఉండాలి. సాగు ఖర్చు తక్కువగా ఉండటం వలన మండలంలోని రైతులు చెర్రీని సాగుచేసేందుకు ముందుకు వస్తున్నారు. చెర్రీ మొక్కలకు వేసవి కాలంలో పూత, శీతాకాలంలో కాయలు వస్తాయి.

> **పిండినల్లి నివారణ ఒకటే సమస్య..**
>
> పిండినల్లి నివారణకు మెత్తని పుట్టమట్టి ద్రావణం కానీ, నీమాస్త్రం కానీ, వేప్పు దీకం పోజర్‌ను గానీ, ద్రావణాలను కానీ పిచికారీ చేస్తే పిండినల్లి త్వరగా అదుపులోకి వస్తుంది. ఎలాంటి సమస్యలు లేని పంట చెర్రీ. కనుక రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలను పాటిస్తూ సాగుచేపట్టడం ద్వారా అధిక దిగుబడులు, లాభాలు గడించవచ్చు.
>
> శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి

40 ఎకరాల్లో సాగు...

గత 20 ఏళ్ల కిందట ఒక రైతు కాశీ వెళ్లి వస్తూ ఆ ప్రాంతం నుంచి తెచ్చి నాటిన రెండు చెర్రీ మొక్కలు మండలంలో నేడు 40 ఎకరాలకుపైగా సాగు చేస్తున్నారు. మండలంలోని ఆదర్శరైతుల్లో ఒకరైన మంగళపూడి కోటిరెడ్డి ఎంతో కాలంగా చెర్రీ సాగు చేస్తూ అధిక లాభాలను గడిస్తున్నారు. అంతేకాకుండా చెర్రీ నారును పెంచి జిల్లా నలుమూలల రైతులకు అతి తక్కువ ధరకు నారును అందచేస్తున్నారు.

ఒక చెట్టుకు 50 కిలోలు..

మొక్క నాటిన మూడో ఏడాదిలో కాయలు రావడం ప్రారంభిస్తాయి. ప్రతి ఏటా చెట్టుకు వచ్చే కాయల దిగుబడి పెరుగుతూ ఆరు నుంచి 9 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి ఒక్కో చెట్టుకు సుమారు 50 కిలోల చెర్రీ కాయలు దిగుబడి వస్తుంది. ఇలా వచ్చిన కాయలను కిలో రూ.25 నుంచి రూ.30 వరకు ధర ఇచ్చి విజయవాడ చెర్రీ పండ్ల ఫ్యాక్టరీ నిర్వాహకులు కొనుగోలు చేస్తున్నారు. అలాగే చిన్న చిన్న పట్టణాలలో సహితం కిలో చెర్రీ కాయలు రూ.100 వరకు వినియోగదారులకు విక్రయిస్తూ పలువురు పండ్ల చిరు వ్యాపారులు లాభాలను గడిస్తున్నారు.

ఆహారంలో వాడుకుంటే మరింత ఆరోగ్యం..

చెర్రీ కాయలు పక్వానికి రాగానే వాటిని కోసుకొని చింతపండు బదులుగా ఆహార పదార్థాల్లో వినియోగించుకొని వాటిని తినడం ఎంతో ఆరోగ్యం.. చింతపండును తినడం వలన గ్రాస్ట్రబుల్ వస్తుంది కానీ చెర్రీకాయలను వంటల్లో వాడుకొని తినడం వలన ఎలాంటి అనారోగ్యాలు దరికిచేరవు. షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా చెర్రీ కాయలు తినవచ్చు. వీటిని తినడం వలన ఆహారం త్వరగా జీర్ణం అవటానికి దోహదపడుతుంది. చెట్ల కొమ్మలకు ముళ్లు ఉండటం వలన చెర్రీ చెట్ల ఆకులను పశువులు కానీ మేకలు కానీ తినలేవు. పొలం చుట్టూ ఈ మొక్కలను నాటుకోవడం వలన పొలంలో వేసే పంటకు కంచెలా ఈ చెట్టు అడ్డుగా ఉండటం ద్వారా పంటకు రక్షణగా నిలుస్తాయి.

సంక్షేమ పథకాలతో మళ్లీ విజయం


లబ్ధిదారుడికి కరపత్రాన్ని అందిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: సంక్షేమ పథకాలతోనే వైఎస్సార్ సీపీ మరలా అధికారంలోకి వస్తుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గురువారం పట్టణంలోని ఒకటో వార్డులో కౌన్సిలర్ బాలుతో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఆయా లబ్ధిదారులకు చేకూరిన లెక్కల కర పత్రాలను పంపిణీ చేశారు. యువకులు, వృద్ధులను పరామర్శిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేయడంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మించిన సీఎం మరే రాష్ట్రంలోనూ లేడన్నారు. ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా పథకాలను రూపొందించి అమలు చేస్తున్నాడని చెప్పారు. ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా సీఎం చేస్తున్నాడని కొనియాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ రహదారులు, సీసీ డ్రైనులు నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. గడప గపడకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమస్యలను తెలుసుకునేందుకు, వినేందుకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. మరలా మరలా జగనన్నను సీఎంగా ప్రజలు ఎన్నుకోవాలని ఆయన కోరారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు విమర్శలు చేసినా ప్రజలు పట్టించుకోరన్నారు. ఏ ప్రభుత్వ పాలనలో తమకు మేలు జరుగుతుందో అందరికీ తెలుసునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, పట్టణ పార్టీ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేశ్, వార్డు ఇన్‌చార్జులు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, మునిసిపల్ సిబ్బంది, వలంటీర్లు, కో ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా


సమస్యలు తెలుసుకుంటున్న కృష్ణమోహన్

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గురువారం స్థానిక ఏఎంసీలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను ఆమంచి కృష్ణమోహన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయా గ్రామాలకు సంబంధించిన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఆమంచి కోరారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందు చీరాల రోడ్డులో పార్టీ కార్యాలయానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కోట హరిప్రసాద్, నాయకులు తోకల కృష్ణమోహన్, ఉప్పలపాటి అనీల్, మల్లా శ్రీనివాసరావు, కంచెనపల్లి రమేష్, అడపా సుధాకరరెడ్డి, లంకా శివ, ఒగ్గిశెట్టి ప్రసాద్, రావువారి ప్రసాద్, షేక్ కాలేషా, బిల్లాలి డేవిడ్, ఇంకొల్లు మండల కన్వీనరు బందారు ప్రభాకరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు పునాది అంగన్‌వాడీలు

- ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి


రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

మేదరమెట్ల: పిల్లలు మంచి చదువులతో పాటు ఉన్నత స్థాయి విద్యకు వెళ్లేందుకుగాను అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి పేర్కొన్నారు. మండల కేంద్రం కొరిశపాడు ఎస్సీకాలనీలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పాఠశాలల్లో విద్యార్థులు కూర్చునేందుకు సరిగా వసతులు ఉండేవి కావని, టాయిలెట్స్‌కు వెళ్లేందుకు బహిర్భూమికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూల్స్‌కు తీసిపోని విధంగా అన్ని వసతులతో ఉన్నాయన్నారు. అనంతరం ఆమె పాఠశాలలోని పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో పున్నయ్య, హెచ్‌ఎం సుశీల, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల్లోనూ ఉపాధి పనులు

అద్దంకి: ప్రతి గ్రామ పంచాయతీలోనూ కూలీలకు ఉపాధి పనులు మొదలు పెట్టాలని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీ పనులు చేసే కూలీలకు కూలీ రూ.250 పడే విధంగా చూడాలన్నారు. ఏపీడీ రాజేశ్ మాట్లాడుతూ కూలీలకు ఎంత పని చేస్తే ఎంత కూలీ వస్తుందో టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీవో బాలకృష్ణ నాయక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు టిప్పర్లు స్వాధీనం

చీరాల: అధిక లోడుతో ఎర్రమట్టిని తీసుకెళుతున్న ఐదు టిప్పర్లను ఒన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. పట్టణంలో అర్ధరాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అధిక లోడుతో ఐదు టిప్పర్లు వెళ్తున్నాయని, వాటిని ఆపి డ్రైవర్లను అడుగగా బాపట్లలో రోడ్డు పనుల కోసం తీసుకెళుతున్నట్లు గుర్తించారు. అధిక లోడుతో ఉండడం వలన టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసును కేసును మోటారు తనిఖీ అధికారికి బదలాయించినట్లు సీఐ తెలిపారు.

25లోపు సెమిస్టర్ ఫీజు చెల్లించాలి

అద్దంకి రూరల్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అద్దంకి స్టడీ సెంటర్ కేఆర్‌కే డిగ్రీ కళాశాలలో మొదటి, రెండో, ఐదో సెమిస్టర్ ఫీజును ఈనెల 25 లోపు చెల్లించాలని కళాశాల ప్రిన్సిపల్ బీ. మోహన్‌రావు, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ప్రభుదాస్ గురువారం తెలిపారు. విద్యార్థులు గమనించాలని ఆయన ఈసందర్భంగా కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


సర్పంచ్ నుంచి బహుమతి అందుకుంటున్న విజేతలు

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమై గురువారం ముగిశాయి. మొత్తం 40 టీములు పోటీల్లో పాల్గొనగా అత్యంత ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. గురువారం క్రికెట్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి చీరాల ఎమిగోస్ టీం గెలుపొందగా కెప్టెన్ వెంకటేష్‌కు గొల్లమూరి రాజగోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు రూ 20,116లు అందజేశారు. రెండో బహుమతి కడవకుదురు క్రికెట్ క్లబ్ సాధించగా కెప్టెన్ వాసుకు నక్కల వీర రాఘవులు రూ 15,116లు బహుమతిని అందజేశారు. మూడో బహుమతి బాపట్ల జిల్లా పోలీస్ టీం గెలుపొందగా టీం కెప్టెన్ కిషోర్‌కు అడుసుమల్లి వీరాస్వామి జ్ఞాపకార్థం వారి కుమారులు రూ 10,116లు అందజేశారు. నాలుగో బహుమతిని పందిళ్లపల్లి పవనిజం జట్టు సాధించగా టీం కెప్టెన్ పల్లపోలు సాయికి వడ్లమూడి బ్రదర్స్ రూ 5,116 అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నక్కల వెంకటనారాయణ, అడుసుమల్లి అంకమ్మరావు, తోట వెంకట సుబ్బారావు, జెడ్పీహెచ్‌ఎస్ విద్యా కమిటీ చైర్మన్ గొల్లమూరి రామకృష్ణారెడ్డి, కార్యనిర్వాహకులు నక్కల విద్యాసాగర్, తోట వాసు, అడుసుమల్లి హరిబాబు, నక్కల సురేష్ తదితరులు ఉన్నారు.

వేమన పద్యాలు చిరస్మరణీయం


పెదగంజాంలో పద్యాల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


సంతమాగులూరులో చిత్రపటానికి పూలమాల వేస్తున్న లైబ్రేరియన్, తదితరులు

చినగంజాం: వేమన పద్యాలల్లో నిజజీవితం కనిపిస్తుందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. యోగి వేమన జయంతిని మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగి వేమన జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు హెచ్ ఎం ఎం దేవదత్తం తెలిపారు.

అద్దంకి: సంతమాగులూరులోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ భాస్కరరెడ్డి వేమన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు భాస్కరరెడ్డి మాట్లాడుతూ నీతి పద్యాలతో వేమన ప్రజకు చేరువ అయ్యాడన్నారు. చదువు రాని వారు సైతం వేమన పద్యాలు చక్కగా వల్లే వేసేంత ప్రాచుర్యం పొందాయని తెలిపారు.

సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శివనాగప్రసాద్

కారంచేడు: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో సాగు పద్ధతులు అవలంబిస్తే పంటలో మంచి దిగుబడులు సాధ్యమేనని ఏవో కే శివనాగప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఆదిపూడి, స్వర్ణ, కారంచేడు ప్రాంతాల్లో పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతన్నలకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సాగులో ఉన్న శనగ చేలు పూత, పిందె దశల్లో ఏపుగా ఉన్నాయన్నారు. అయితే వాతావరణ మార్పులను బట్టి అక్కడక్కడ చేలల్లో కుంకుమ తెగులు, ఎండు తెగుళ్లు కనిపిస్తుందన్నారు. వీటి నివారణకు ట్రైకోడెర్మావిరిడిని పిచికారీ చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఈ పద్ధతులు పాటిస్తే తెగుళ్లను నివారించుకోవడమే కాకుండా పంటలో మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్‌ఏలు, రైతులు, ఆర్‌బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

తలోదారి పట్టిన తమ్ముళ్లు

చీరాల: తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ క్యాడర్ పూర్తిగా దెబ్బతింటున్న పరిస్థితుల్లో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు 27వ వర్ధంతిని పురస్కరించుకుని విభేదాలు భగ్గుమన్నాయి. ఒకప్పుడు చీరాల నియోజకవర్గంలో బలంగా ఉన్న టీడీపీ క్యాడర్ ఎమ్మెల్యే కరణం బలరాం వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వడంతో పార్టీ క్యాడర్ మొత్తం వైఎస్సార్ సీపీలోకి వచ్చింది. అప్పటి పరిస్థితుల్లో ఇన్‌చార్జిగా యడం బాలాజీని నియమించారు. అయితే అనంతరం కొన్ని వర్గ విభేదాలతో ఎంఎం కొండయ్యను ప్రస్తుతం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. అయినప్పటికీ ఆయన ఆధ్వర్యంలో పార్టీలో మూడు ముక్కలుగా కొనసాగుతుంది. ఎన్టీఆర్ వర్ధంతిని ఎంఎం కొండయ్య టీడీపీ కల్యాణ మండపంలో నిర్వహించి అన్నదానం, రక్తదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఇదిలా ఉంటే యడం బాలాజీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. మొదటి నుంచి కొండయ్యను విభేదిస్తున్న పట్టణ మాజీ అధ్యక్షుడు దేట నాగేశ్వరరావుతో పాటు మరి కొందరు నాయకులు ఈపూరుపాలెంలో ప్రత్యేకంగా ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇటీవల వచ్చిన గజవల్లి శ్రీనివాసరావుకు టీడీపీ పట్టణాధ్యక్షుడిగా నియమించడంతో కొండయ్యకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో టీడీపీ ఎన్నికల ముందే చీలికలుగా మారింది.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మేదరమెట్ల: దళిత ఆదివాసి మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జనశిక్షణ సంస్థాన్‌ప్రోగ్రాం అధికారి కే.శ్యామ్‌సునీల్ అన్నారు. మండల కేంద్రం కొరిశపాడులో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు పథకాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా సమకూర్చుకున్న యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం వలన వాటిపై శ్రద్ధ పెరుగుతుందన్నారు. సబ్‌ప్లాన్ నిధుల ద్వారా స్వయం సహాయక సంఘాలను అభివృద్ధి పరుచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, సునీత మహిళలు పాల్గొన్నారు.

కల్తీ ఎరువులు విక్రయిస్తే చర్యలు

వేటపాలెం: ఎరువులు, పురుగు మందుల షాపుల్లో కల్తీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఏవో ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. గురువారం స్థానిక రాఘవేంద్ర ట్రేడర్స్ షాపులో తనిఖీలు నిర్వహించారు. రెండు రకాల కంపెనీలకు సంబంధించిన పురుగు మందులు శాంపిల్స్ తీసి పరీక్ష నిమిత్తం రీజినల్ సెంటర్స్‌కి పంపించినట్లు ఆయన పేర్కొన్నారు.

నేల ఆరోగ్యమే పంటల ఆరోగ్యం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

మార్టూరు: నాణ్యమైన నేలలో ఆరోగ్యకరమైన పంటలు పండించటమే కాక అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకాశం జిల్లా ఆత్మప్రాజెక్ట్ డైరక్టర్, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త కే అన్నపూర్ణ అన్నారు. స్థానిక ఆర్బీకే సెంటర్‌లో గురువారం నిర్వహించిన మార్టూరు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రసాయనిక ఎరువులు విచక్షణ రహితంగా వినియోగించటం వలన భూమిలో సారం నశించడమే కాక 50 నుంచి 60 శాతం సాగు ఖర్చు పెరుగుతుందని ఆమె అన్నారు. నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యమని రైతులు గుర్తించి సేంద్రియ, జీవన ఎరువుల వాడకంతో పాటు పచ్చిరొట్ట పంటల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. వివిధ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. ఏరువాక శాస్త్రవేత్త జే రమేష్ మాట్లాడుతూ ప్రత్తి, మొక్కజొన్న, శనగ, వరి, మిరప, మినుము మొదలైన పంటల్లో మేలైన వంగడాల గురించి, తెగుళ్ల నివారణ పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్టూరు, బలికురవ, జే పంగులూరు, సంతమాగులూరు, మండలాల వ్యవసాయాధికారులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.